ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 14 జూలై 2025 | 5



ఇంజనీరింగ్ సీట్ల లెక్క తేలింది
» జేఎన్టీయూకే పరిధిలో సీట్లకు ఖరారు
» 2025-26 విద్యాసంవత్సరానికి 106 కళాశాలలకు గుర్తింపు
» ఇంజనీరింగ్‌లో 30వేల సీట్లకు అనుమతి
» 18 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు
7

'రంగరాయ'లో ముగిసిన గైనకాలజీ సదస్సు

» వివిధ రాష్ట్రాల నుంచి 1,200 మంది గైనకాలజిస్ట్‌లు రాక

జీజీహెచ్(కాకినాడ), జూలై 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆబ్‌స్ట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో రెండురోజులపాటు జరిగిన గైనకాలజీ సదస్సు ఆదివారం ముగిసింది. ఆంధ్రప్రదేశ్ ఆబ్‌స్ట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ 10వ వార్షిక సదస్సులో 72స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆంధ్ర, తెలంగాణలతోపాటు పలు రాష్ట్రాలనుంచి 1,200 మంది గైనకాలజిస్ట్‌లు హాజరయ్యారు. ప్రసూతి వైద్యసేవల్లో అధునాతన వైద్య ప్రక్రియలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, వివిధ ఆరోగ్య పరిస్థితుల్లో ప్రసూతి ప్రక్రియలు, ల్యాప్రోస్కోపిక్ సర్జరీల్లో కాంప్లికేషన్స్ నిర్వహణ, యుక్త వయసు బాలికల్లో రుతుస్రావ సమస్యలు, ప్రసూతి వేళ మెడికో లీగల్ కేసుల నిర్వహణ అంశాలపై సైంటిఫిక్ సెషన్స్ నిర్వహించారు. వర్క్ షాపుల్లో 25కు పైగా శస్త్రచికిత్సలు చేశారు. ముగింపు సదస్సుకు డాక్టర్ పళని అప్ప, డాక్టర్ మాలరాజ్, డాక్టర్ కోలా శశికళ, డాక్టర్ పటేల్ వక్తలుగా వ్యవహరించారు.

తిరోగమన విధానాలతో విద్యా ప్రమాణాలకు పాతర

» ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గం

కాకినాడ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరోగమన విధానాలతో విద్యా ప్రమాణాలకు పాతర వేయవద్దని, విద్యా రంగాన్ని ప్రయోగశాలగా మార్చవద్దని ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో బోధనేతర పని భారంతో ఉపాధ్యాయులను బోధనకు దూరంగా ఉంచుతూ విద్యా రంగానికి తీరని నష్టం కలిగించే విద్యా శాఖ ఉన్నతాధికారుల నిర్ణయాలను నిరసిస్తున్నామన్నారు. మొబైల్ ఫ్రీ క్లాస్ రూం విధానాన్ని పాఠశాల విద్యా శాఖ తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, నాయకులు కోటేశ్వరరావు, రామచంద్రయ్య, శివప్రసాద్, సుభాని, కాకినాడ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోర్త శ్రీనివాస్, కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

జి.మేడపాడులో 'సుపరిపాలనలో తొలి అడుగు'



సామర్లకోట మండలం జి.మేడపాడులో ప్రసంగిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాసు

సామర్లకోట మండలం జి.మేడపాడులో ఎమ్మెల్యే చినరాజప్ప ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' సభకు మంత్రి కొండపల్లి శ్రీనివాసు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సంబంధించి పలు అంశాలు తెలియజేశారు.

భూ..కేర్ ఫుల్!



భూ పందేరానికి కూటమి ప్రభుత్వం చెక్

ఖాళీ జాగా కనబడితే చాలు.. అది ప్రభుత్వానిదా?.. ప్రైవేటుదా?..అనే విషయం అసలు పట్టించుకోరు.. ఆక్రమించేస్తారు.. రక్కున లింక్ డాక్యుమెంట్లు పుట్టిస్తారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో డబ్బుల కట్టలు విసిరి ఆ భూమిని చుట్టబెట్టేస్తారు. బాధితులు లబోదిబోమన్నా కదలరు వదలరు.. గత ప్రభుత్వంలో కబ్జా అనేది ఒక వృత్తిగా అవతరించింది. జడ్జి రామకృష్ణ భూములు ఒక వైసీపీ నాయకుడు ఆక్రమించారని గగ్గోలు పెట్టినా ఏం చేయలేని పరిస్థితి. నాడు ఇలా ఎందరో బాధితులు తమ భూములు ఆక్రమించారని పోలీస్ స్టేషన్, కోర్టు మెట్లు ఎక్కిన వారున్నారు.. అయినా లాభం లేకపోయింది.. కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించిందో ఏమో కానీ.. భూ అక్రమాలకు ప్రభుత్వం చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది.

(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం)

భూ అక్రమాలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. ఇప్పటి వరకూ రిజిస్ట్రేషను రద్దు అధికారం పౌర న్యాయస్థానాలకు మాత్రమే ఉండగా.. ఇప్పుడు ఆ అధికారం కలెక్టర్‌కి దాఖలు పరుస్తూ చట్టం అమల్లోకి వచ్చింది. ఆస్తుల రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరిగితే వాటిని రద్దు చేసే అధికారాన్ని కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటయ్యే కమిటీకి దాఖలు పరుస్తూ 1908 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రాష్ట్ర శాసన సభ ఆమోదం తెలిపింది. శాసన సభ ఆమోదించిన సవరణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ప్రభు త్వం జారీ చేసిన నోటిఫికేషన్ బుధవారం నుంచి అమల్లోకి వచ్చేసింది. వాస్తవానికి భూముల క్రయ, విక్రయాల సమయంలో సబ్- రిజిస్ట్రార్లు ఆ భూమి/స్థలానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలి. ఒక వేళ ప్రభుత్వానికి చెందిన లేదా నిషేదిత జాబితా (22ఏ)లో ఉన్న భూముల వివరాలను రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ల శాఖకు అందజేస్తుంది. ఆ జాబితాలో ఉన్న భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ రిజిస్ట్రేషను చేయడానికి వీల్లేదు. ప్రభుత్వ భూములను కాపాడడంలో కలెక్టర్‌కి ఎంత బాధ్యత ఉంటుందో.. సబ్-రిజిస్ట్రార్లకూ అంతే ఉంటుంది. అది వారి విధి కూడా. అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు రుజువైతే సబ్-రిజిస్ట్రారుకు మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకూ జైలు శిక్ష విధించే అవకాశాన్ని చట్టం కల్పిస్తోంది.కానీ చట్టాల్లో ఉన్న లొసుగులు, కోర్టుల్లో ఏళ్లకు తరబడి విచారణ నడవడం వంటి కారణాలతో వాళ్లకు భయం, బాధ్యత పోయాయి. వాస్తవానికి మోళీ తతంగానికి సబ్-రిజిస్ట్రారు కార్యాలయమే కేంద్ర బిందువుగా ఉంటుంది. చట్టాలు ఉన్నా ఇప్పటి వరకూ యథేచ్ఛగా భూ అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతూనే ఉన్నాయి.

ఫ్రీ హోల్డు పేరుతో..

22(ఎ) జాబితాలో ఉన్న భూములను కబ్జాదారులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటూనే ఉన్నారు. వాస్తవానికి నిషేధిత భూముల జాబితా ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో గ్రామాలు, సర్వేల వారీగా ఉంటుంది. కానీ దానిపై పెద్దగా అవగాహన లేక ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఆక్రమణదారులు చేజిక్కించుకుంటున్నారు. 2023లో వైసీపీ ప్రభుత్వం ఆడిన ఫ్రీహోల్డు నాటకం భూ పందేరానికి పరాకాష్ఠగా చెప్పవచ్చు. నిషేధిత జాబితాలో ఉన్న కొన్ని భూములను, చుక్కల భూములను అప్పట్లో జాబితా నుంచి తొలగించారు. దీనినే ఫ్రీహోల్డు అంటారు. దీంతో వీటికి రిజిస్ట్రేషను చేయించుకొనే వెసులుబాటు కలిగింది. అంతే.. వైసీపీ నాయకులు రంగంలోకి దిగారు. ఉమ్మడి తూర్పు గోదావరిలో వందలాది ఎకరాలు చుట్టబెట్టేశారు. ఎంతలా అంటే అటు రెవెన్యూ, ఇటు రిజిస్ట్రేషన్ల అధికారుల లెక్కలకు పొంతన కుదరనంతగా నొక్కేశారు. ఉదాహరణకు తూర్పు గోదావరి జిల్లాలో 5120 ఎకరాలను ఫ్రీహోల్డు చేశారు. వీటిలో 47 లావాదేవీల ద్వారా 41.866 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని జిల్లా రిజిస్ట్రారు కార్యాలయ రికార్డులు చెబుతుంటే.. 100 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని కలెక్టరేట్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన చట్టంతో ఫ్రీహోల్డును సెట్‌చేసే పనిని కూడా ప్రభుత్వం మొదలు పెట్టనుంది.

కొత్త చట్టం ఏం చెబుతుందంటే..

కొత్తగా వచ్చిన చట్టంతో ప్రతి జిల్లాలో ఒక కమిటీ ఏర్పడుతుంది. జిల్లా కలెక్టరు చైర్మన్‌గా ఉంటే, రిజిస్ట్రేషన్ల శాఖ, రెవెన్యూ తదితర శా ఖల నుంచి ఇతర సభ్యులు ఉంటారు. అక్ర మంగా రిజిస్ట్రేషను జరిగిందని కలెక్టర్‌కి ఫిర్యాదు అందిన తర్వాత కమిటీ రంగంలోకి దిగుతుంది. రిజిస్ట్రేషను అక్రమమని తేలితే రద్దు చేస్తారు. ఇప్పటి వరకూ ఈ అధికారం క్రయ విక్రయదారులిద్దరూ కలిపి లేదా సివిల్ కోర్టుల చేతుల్లోనే ఉండేది. కొత్తగా వచ్చిన చట్టంతో ఖర్చు, సమయం కూడా ఆదా అవు తుందని చెబుతున్నారు. విధి విధానాలు తమకు ఇంకా రాలేదని తూర్పు గోదావరి జిల్లా రిజిస్ట్రారు సత్యనారాయణ తెలిపారు.

» భూ అక్రమాలకు చెల్లు
» కలెక్టర్ చేతిలో పాశుపతాస్త్రం
» కొత్త చట్టంతో రద్దుకు అవకాశం
» 1908 నాటి చట్టానికి సవరణ
» అసెంబ్లీలో ఆమోదించిన సర్కార్
» కోర్టు కెళ్లకుండానే పరిష్కారం
» భూ బాధితులకు శుభవార్త
» కబ్జాదారులకు చేదువార్త
» నాటి అక్రమాలతో మేలుకొలుపు



మన కోటావోడు.. ఇక లేడా!

నటుడు జిత్‌మోహన మిత్రతో కోట (ఫైల్)

గోదారోళ్లతో ఎంతో అనుబంధం

నాకేంటి.. నాకేంటి!.. అంటూ అహ నా పెళ్లంటలో పిసినారి క్యారెక్టర్‌లో కడుపుబ్బా నవ్వించినా.. వీడెవండి బాబూ అంటూ పవిత్ర బంధం సినిమాలో వెంకటేష్ తండ్రిగా ఆకట్టుకున్నా.. శత్రువు..గణేష్ సినిమాల్లో విలన్ పాత్రల్లో రాణించినా.. గోదారోళ్ల యాస భాషలే ఆయన నటనకు కంచుకోట.. పాత్ర ఏదైనా గోదారోళ్ల డైలాగ్‌లతో ఆకట్టుకునేవారు.. అందుకే ఒకానొక టైమ్‌లో మన కోటావోడు.. ఉన్నాడంట్రా సినిమా కెళదాం అనేస్థాయికి అభిమానుల గుండెల్లో కోట కట్టుకున్నారు.. అయితే ఆదివారం ఆయన మృతిచెందడంతో.. ఇక లేరనే చేదునిజాన్ని తట్టుకోలేక అభిమానులు కన్నీటిపర్యంతమయ్యారు.

» తొలి సినిమా ప్రాణం ఖరీదు
» కోనసీమలోనే చిత్రకరణ
» కన్నీళ్లు పెట్టుకున్న అభిమానులు

అమలాపురం రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): క్రూరమైన విలనిజమైనా, కడుపుబ్బ నవ్విం చే హాస్యరసమైనా, కన్నీళ్లు పెట్టించే సెంటిమెంటు సీనైనా.. ఏదైనా అవలీలగా చేసేసి.. సీన్‌ను పండించగల అతి అరుదైన ఆర్టిస్టు కోట శ్రీనివాసరావు.. గోదావరి జిల్లా వాళ్లకు మాత్రం ఎప్పటికీ కోటావోడు..హాస్యాన్ని కొత్త పుంతలు తొక్కించడంతో పాటు తన సహజశైలి నటనతో, వాక్ చాతుర్యంతో చలనచిత్రసీమలో ప్రత్యేక స్థానం సాధించారు. సహజ నటుడిగా పేరొందిన కోట శ్రీనివాసరావుకు కోనసీమతో ఎంతో అనుబంధం ఉంది. 1978లో విడుదలైన ప్రాణం ఖరీదు చిత్రంలో తొలిసారిగా కోట శ్రీనివాసరావు నటించారు.ఆ చిత్రం షూటింగ్ సఖినేటిపల్లి మండలం గుడిమూల పరిసర ప్రాంతాల్లోనే జరిగింది. సినిమాల్లో నటిస్తూనే బ్యాంకు ఉద్యోగిగా కొనసాగారు. 1987లో కోటశ్రీనివాసరావు సమనసలోని స్టేట్ బ్యాంకులో పని చేశారు. నాటి గ్రామ సర్పంచ్ మామిళ్లపల్లి రాజారావు నడుపుతున్న అన్నపూర్ణ టాకీస్‌ను సందర్శించారు. టాకీస్ వద్ద శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. చిత్రమేమిటంటే ఆ సమయంలో అన్నపూర్ణ టాకీస్‌లో లేడీ సూపర్ స్టార్ విజయశాంతి నటించిన ప్రతిఘటన చిత్రం ఆడుతోంది. ఆ సినిమాలో కోట శ్రీనివాసరావు నటించారు. కోట శ్రీనివాసరావు మృతిచెందారన్న సమాచారం ఎంతో కలచివేసిందని నాటి సర్పంచ్ మామిళ్లపల్లి రాజారావు అన్నారు.

ఎన్నో మరుపురాని పాత్రలు

తర్వాత జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన అహ నా పెళ్లంటలో కోట శ్రీనివాసరావు లక్ష్మీపతి అనే విలక్షణమైన పాత్రల్లో నటించారు. పిసినారి తండ్రిగా ఆయన చేసిన పాత్ర ఎంతో మెప్పించింది. గోదావరి జిల్లాలోనే ఈ చిత్ర ం షూటింగ్ జరగ్గా ఈ పాత్రలో కోడిని కట్టేసి సగం పగిలిన కళ్ల అద్దాలతో ఉత్తి అన్నం తింటూ చికెన్ తిన్నట్టుగా ఫీలయ్యే సీన్‌ను ఇప్పటికీ మీమ్స్‌లో వైరల్ చేస్తుంటారు. కోటా నటించిన మరో మరుపురాని చిత్రం వంశీ దర్శకత్వంలో వచ్చిన శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్.. ఇందులో ఏళ్ల పాపారావుగా ఆయన పండించిన హాస్యం అద్భుతం.. రాజమహేంద్రవం, కోనసీమల్లో ఈ చిత్ర షూటింగ్ జరగ్గా.. గోదావరి యాసలో కోటా పలికిన డైలాగులు మరో స్థాయిలో ఉంటాయి. జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన చూపులు కలిసిన శుభవేళ చిత్రంలో గుర్నాథం పాత్ర కోటకు మరో ఆణిముత్యం లాంటిది.తెలుగు భాషను ప్రేమించే జమిందారుగా..ఆయన గ్రాంధిక భాషలో మాట్లాడుతూ పండించిన హాస్యం భలే ఉంటుంది. 'ఉత్తరపురుషుడు', 'నిశివర్ణోష్ణోదకము' 'ఉష్ణగ్రాహకమటం', 'అశ్వము అధిరోహించుట', 'చతుష్చక్ర శకట నివాస స్థానము' అనే పదాలు.. ఆయన నోటి వెంట ఆరోగ్యకరమైన హాస్యాన్ని పండించాయి. తర్వాత కోనసీమ పరిసరాల్లో తీసిన ఖైదీనెంబరు 786లో ఆయన సూర్యచంద్రరావు పాత్రలో మెప్పించారు. యమలీలలో ఇన్‌స్పెక్టర్ రంజిత్, హలోబ్రదర్‌లో తాడిమట్టయ్యవినోదంలో బంగారం సహా ఇంకా అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. 1992లో విడుదలైన భలే ఖైదీలు చిత్రం కాకినాడ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంది. కీలక సన్నివేశాల చిత్రీకరణలో కాకినాడలోని ప్రైవేటు బస్సులో షూటింగ్ నిర్వహించారు. ఈ చిత్రంలో అమలాపురం రూరల్ మండలం సవరప్పాలెం గ్రామానికి చెందిన సత్తి శ్రీరామప్రసాద్ ఆర్టీసీ కండక్టర్‌గా నటించారు. కోట శ్రీనివాసరావు మృతిచెందారన్న వార్త తనను ఎంతగానో కలచివేసిందని శ్రీరామప్రసాద్ నాటి షూటింగ్ సంఘటనలను గుర్తు చేసుకున్నారు.ఇక అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తున్న ప్రముఖ రచయిత దువ్వూరి సుబ్రహ్మణ్యశర్మ పలు పర్యాయాలు కోట శ్రీనివాసరావును కలిశారు.ఆయనతో అనుబంధాన్ని సుబ్రహ్మణ్యశర్మ వివరించారు. కోట శ్రీనివాసరావు మృతికి ఎంపీ పురం దేశ్వరి సంతాపం తెలిపారు.



అనపర్తిలో 'కోట' ఎన్నికల ప్రచారం

అనపర్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోట శ్రీనివాసరావు మరణం తీరని లోటని బీజేపీ నాయకుడు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి అన్నారు. కోటతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.1998లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి తరఫున ప్రచారం చేసేందుకు అనపర్తి వచ్చిన ఆయనతో ముచ్చటించే అవకాశం కలిగిందన్నారు. అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన బి.రత్నారెడ్డి..1966లో ఏలూరులోని సీఆర్‌రెడ్డి కళాశాలలో కోట శ్రీనివాసరావుతో కలిసి డిగ్రీ (బీఎస్సీ) పూర్తి చేశారు.

కోటాభిమానులు..

దేవీపట్నం/రాజమహేంద్రవరం కల్చరల్/నిడదవోలు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ముద్దుల ప్రియుడు చిత్రం దేవీపట్నం ఉమాచోడేశ్వర స్వామి ఆలయంలో షూటింగ్ చేశారు. ఈ సినిమాలో కోట శ్రీనివాసరావు కొబ్బరికాయల సుబ్బయ్య పాత్రలో నటించారు. సినీనటుడు కోట శ్రీనివాసరావుతో తమకు గల అనుబంధాన్ని రాజమహేంద్రవరానికి చెందిన నటుడు, గాయకుడు జిత్‌మోహన్ మిత్ర పంచుకున్నారు. సుమారు 50 సినిమాల్లో ఆయనతో కలిసి నటించినట్టు చెప్పారు. కోట శ్రీనివాసరావుతో తాను తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాడాల గ్రామం, రాజమహేంద్రవరం సిటీ పరిధిలోని మోరంపూడిలో జరిగిన సినిమా షూటింగుల్లో పాల్గొన్నట్టు తెలిపారు. నిడదవోలు పరిసర ప్రాంతాల్లో 1996 సంవత్సరం తాళి సినిమా చిత్రీకరణ సమయంలో సినీనటుడు కోట శ్రీనివాసరావు నిడదవోలు పట్టణంలోని సుంకవల్లి గణేశ్వరరావు నివాసంలో విడిది చేశారు. ఆ సమయంలో గణేశ్వరరావు కుమారుడు సుంకవల్లి శ్రీధర్ వారితో ఫొటో దిగారు. ఆయన మృతితో గోదావరి జిల్లాల్లో అభిమానులు జ్ఞాపకాల నెమరువేసుకుని కన్నీటిపర్యంతమవుతున్నారు.

సక్రమంగా సాగని రీ ఎసెస్‌మెంట్ సర్వే!



కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో ఓ కళాశాల భవన సముదాయం

» బడా బాబుల భవనాలకు వర్తించని నిబంధనలు
» పంచాయతీల ఆదాయానికి గండి

సర్పవరం జంక్షన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): బహుళ అంతస్తుల వ్యాపార,వాణిజ్య భవ నాలు, 10వేల చదరపు అడుగులు దాటిన భవన సముదాయాల విస్తీర్ణం, నిర్మాణాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు మార్కెట్ రేట్ల ప్రకారం పన్నులు విధించి పంచాయతీల ఆదాయం పెంచాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పూర్వం నిర్మించిన సముదాయాలపై ఆదాయం స్వల్పంగా రావడం, ఏటా 5శాతం పన్ను పెంచడమే తప్పించి వాస్తవంగా భవనాల నిర్మాణం సమయంలో తీసుకున్న అనుమతులకంటే అదనంగానిర్మించిన భవనాలతో పంచాయతీలకు ఆదాయం రావట్లేదు. దీంతో రీఎసెస్‌మెంట్ చేసి పన్నులు పెంచుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అధికారులు బడాబాబుల వ్యాపార, వాణిజ్య, విద్యా సముదాయాలు, అనధికారిక భవనాల జోలికెళ్లకుండా తూతూమంత్రంగా ఎసెస్‌మెంట్ చేసి నామమాత్రపు పన్ను విధించేలా చర్యలు తీసుకుంటున్నారు.

బయటపడుతున్న అనధికారిక భవనాలు

పంచాయతీలు ఆదాయం పెంచుకునేందుకు వీలుగా ప్రభుత్వం గ్రామాల్లో రీఎసెస్‌మెంట్(పన్నుసవరణ) సర్వే చేపట్టాలని ఆదేశించింది. గ్రామాలు, పట్టణాల్లో 10వేల చదరపు అడుగుల విస్తీర్ణం(ఎస్ఎఫ్‌టీ) కలిగిన వ్యాపార, వాణిజ్య, బహుళ సముదాయాలను క్షేత్రస్థాయిలోకి వెళ్లి పన్నుల సవరణ కోసం రీ ఎసెస్‌మెంట్ చేయాలని సూచించింది. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో సర్వే నెం.124, 125ల్లో 3.70 ఎకరాల భూమిలో ప్రస్తుతంఉన్న రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ పేరిట జీప్లస్‌టూతో పంచాయతీ అనుమతితీసుకున్నారు. 2004లో ఈభవనంపై మరో రెండు అంతస్తుల నిర్మాణం కోసం తిమ్మాపురం పంచాయతీకి నిర్వాహకులు దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి పాలకవర్గం ప్లాన్ అప్రూవల్స్ కోసం సాంకేతిక అనుమతుల కోసం రాజమండ్రి ఆర్‌జేడీటీసీకి తీర్మానం చేసి పంపించారు. అనుమతులు లేకుండానే అదనపు పైఅంతస్తులు నిర్మించారు. ఇవి కాకుండా అనధికారికంగా పలు నిర్మాణాలు చేపట్టారు. అప్పటినుంచి నామమాత్రపు పన్ను చెల్లిస్తూ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇటీవల పన్నుల సవరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లగా నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణం, క్రమబద్ధీకరణ లేకుండాఉన్న విద్యాభవన సముదాయాన్ని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం పంచాయతీకి రూ.లక్ష వరకు పన్ను చెల్లిస్తున్నారు. నిబంధనల మేరకు సవరణ చేస్తే ఏడాదికి రూ.3.50 లక్షలు వరకు చెల్లించాల్సి ఉంటుంది. 20ఏళ్లుగా లక్ష రూపాయల్లోపు మాత్రమే పన్ను చెల్లించడంతో పంచాయతీ ఆదాయానికి లక్షల్లో గండిపడింది. సదరు కాలేజీ నిర్వాహకులు రాజకీయ పరపతితో డీపీవోస్థాయి నుంచి ఈవోపీఆర్డీ, కార్యదర్శిలపై ఒత్తిడి తెచ్చి పన్ను సవరణ చేయకుండా చూసుకుంటున్నట్టు విమర్శలున్నాయి. మండలంలో అనేక భవనాలు ఇదే రీతిలో నామమాత్రపు పన్ను పెంచేలా చర్యలు తీసుకుంటున్నారని తెలుస్తోంది.

నేడు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ కాకినాడ రాక

కలెక్టరేట్(కాకినాడ), జూలై 13(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజా సోమవారం కాకినాడ నగరానికి రానున్నారు.ఉదయం 11.30 గంటలకు కాకినాడ ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు రంగరాయ మెడికల్ కళాశాలకు(ఆర్ఎంసీ) చేరుకుంటారు. లైంగిక వేధింపులు ఎదుర్కొన్న బీఎస్సీ మెడికల్ లేబొరేటరీ టెక్నాలజీ కోర్సు విద్యార్థినులతో ఆమె ఇంట్రాక్ట్ అవుతారు. దీనిపై విచారణ చేస్తారు. మధ్యాహ్నం 3.30గంటలకు కాకినాడ జీజీహెచ్‌కు చేరుకుంటారు. మెటర్నిటీవార్డులో మహిళా రోగులను కలిసి యోగాక్షేమాలు తెలుసుకుంటారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు కాకినాడనుంచి ఆమె బయలుదేరి తాడేపల్లి చేరుకుంటారు.

17 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు

కార్పొరేషన్(కాకినాడ),జూలై13(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈనెల 17 నుంచి 20 వరకు కాకినాడ సూర్యకళామందిరంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు కర్రి అచ్యుతరామారెడ్డి తెలిపారు. ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు అధ్యక్షతన నగరంలోని దంటు కళాక్షేత్రంలో అల్లూరిసీతారామరాజునాటక కళాపరిషత్ సిల్వర్‌జూబ్లీ వేడుకల ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. బ్రోచర్‌ను కర్రి భామిరెడ్డి, కర్రి అచ్యుతరామారెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఎస్‌వీ బాపిరాజు, ట్రెజరర్ నూకరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటక కళాపరిషత్‌ను విజయవంతంచేసేందుకు, ప్రజలను ఆకర్షించేందుకు రోజూ రెండు లక్కీడిప్‌లు తీస్తామని చెప్పారు. టీవీవీఎస్ఎన్‌రెడ్డి, ఉమాసత్యనారాయణ ఎం.బుచ్చయ్య, బాలు, ఎస్వీరమణ, వర్మ, మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐదో సాలే!

ఇప్పటికే 4 సార్లు వేలం వాయిదా



» ఐదోసారి భూముల కౌలుకి వేలం
» దేవదాయశాఖ అధికారుల తీరుపై అనుమానాలు
» పిఠాపురం సంస్థానం సత్రానికి తొండంగిలో 511 ఎకరాలు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఒకటి, రెండు కాదు ఏకంగా నాలుగుసార్లు.. అదీ భూముల కౌలు వేలం ప్రక్రియకు వెళ్లకుండానే.. దానికి చెప్పే కారణాలు హాస్యాస్పదంగా ఉన్నాయి. వైసీపీ హయాంలో వేలంలో కౌలుకు తీసుకున్న వ్యక్తులకు మేలు చేసేందుకే ఇలా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పిఠాపురం పట్టణంలో దేవదాయశాఖ నిర్వహణలోని సంస్థానం సత్రానికి తొండంగిలో, పంపాదిపేటల్లో 511 ఎకరాల భూములున్నాయి. పిఠాపురం మహారాజా ఈ భూములను దానమిచ్చారు. వీటికి కౌలు నిమిత్తం మూడేళ్లకోసారి వేలం నిర్వహించి దానిపై వచ్చే ఆదాయంతో సత్రం నిర్వహణ, ఇతర కార్యక్రమాలు చేపట్టాలి. ఇందులో 481.46 ఎకరాలకు మాత్రమే వేలం జరుగుతోంది.

అంతంతమాత్రమే ఆదాయం

సంస్థాన సత్రం పిఠాపురంలో ఉండడం, దాని భూములు తుని నియోజకవర్గ పరిధి తొండంగిలో ఉండడంతో భూములను కౌలుకు సాగు చేసుకునే నిమిత్తం వేలం నిర్వహణలో అక్కడి రాజకీయ నాయకుల ఒత్తిడితో ఆదాయం అంతంతమాత్రంగానే సమకూరుతోంది. వైసీపీ హయాంలో అప్పటి తునిప్రజాప్రతినిధుల ఒత్తిడితో వేలం సక్రమంగా జరగకపోగా అప్పుడు భూములు పొందినవారే ఇప్పటికీ సాగు చేసుకుంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 481.46 ఎకరాలను బిట్లుగా మూడేళ్ల పాటు కౌలుకు సాగు చేసుకునే హక్కు కోసం వేలం నిర్వహించాలని దేవదాయశాఖ అధికారులు నిర్ణయించారు. నాలుగుసార్లు విచిత్రమైన కారణాలతో వేలం నిర్వహించకుండా వాయిదా వేశారు.

వాయిదాలు ఇలా

సంస్థానం సత్రం భూములకు తొలిసారి మే 23 నుంచి 29 వరకు వేలం వేస్తామని అధికారులు ప్రకటించారు. ఆ సమయంలో టీడీపీ మహానాడుకు రైతులువెళ్లారని కారణం చూపుతూ వాయిదా వేశారు. జూన్ 6నుంచి వేలం నిర్వహిస్తామని చెప్పి దండోరా వేయలేదని సాకుగా చూపి వాయిదా వేశారు. జూన్ 20 నుంచి 26 వరకు వేలం నిర్వహిస్తామని యోగా దినోత్సవానికి పోలీసులు వెళ్లారని, బందోబస్తు ఇవ్వలేమని వాయిదా వేశారు. జూలై 8 నుంచి 15 వరకు వేలం నిర్వహిస్తామని ప్రకటించి ఈసారి పోలీసులు సింహాచలం గిరిప్రదక్షిణ బందోబస్తుకు వెళ్లినందున వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పుడు ఐదోసారి ఈ నెల 14 నుంచి 19 వరకు వేలం నిర్వహిస్తామని ప్రకటించారు.

వారికి మేలు చేసేందుకే..

ఖరీఫ్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఇప్పుడు కౌలుకు వేలం నిర్వహిస్తే రైతులు, ఆసక్తిగలవారు వచ్చే అవకాశాలు తక్కువ. ఈ భూములు పాత వారికే మళ్లీ దక్కుతాయి. వారికి మేలు చేసేందుకే దేవదాయశాఖ అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.వైసీపీ హయాంలో కౌలు హక్కు పొందిన వారికి మేలు చేసేందుకే కూటమి నేతలు ఒత్తిడి తెస్తున్నారని, అందుకే అధికారులు విచిత్ర కారణాలతో వేలాన్ని వాయిదాలు వేస్తూ పోతున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.


గోదావరి ప్రవాహం


ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

పెరుగుతూ.. తగ్గుతూ...


కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి ప్రవహం

అత్యధికంగా 6,56,341 క్యూసెక్కులు సముద్రంలోకి...

ధవళేశ్వరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద పెరుగుతూ ప్రవహించిన గోదావరి ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిలకడగా కొనసాగి ఆపై తగ్గుముఖం పట్టింది. ఆదివారం ఉదయానికి అత్యధికంగా 6,56,341క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా దిగువకు ప్రవహించింది. ఈ సమయంలో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. మధ్యాహ్నం వరకు నిలకడగా కొనసాగిన ప్రవాహం ఆపై తగ్గుముఖం పట్టి సాయంత్రానికి 40 వేల క్యూసెక్కులకు పైగా తగ్గి 6,14,762 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద 24గంటల వ్యవధిలో 10 అడు గుల మేర తగ్గిన నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 30.60 అడుగులకు చేరుకుంది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 4,800క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2600 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6800 క్యూసెక్కులు చొప్పున నీరు విడుదల చేస్తున్నారు.




కూనవరం-వీఆర్‌పురం మండలాల మధ్య ఉన్న బ్రిడ్జి దగ్గర శబరి, గోదావరి ప్రవాహం

కూనవరంలో 3 అడుగులకు..

కూనవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండలంలో శబరి, గోదావరి నదులు తగ్గుముఖం పట్టింది. ఈ ప్రాంతంలో వరద 35 అడుగులకు చేరుకుంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి వరద తగ్గుముఖం పట్టింది. కూనవరంలో ఆదివారం రాత్రి 7 గంటలకు 3 అడుగులకు వరద ప్రవాహం చేరుకుంది.


రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద నీటి ప్రవాహం

గోష్పాదక్షేత్రంలో శివలింగాలను ముంచెత్తిన వరద

కొవ్వూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాల్లో వర్షాలకు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో అఖండ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. భద్రాచలం వద్ద 41.3అడుగులకు చేరుకుని తగ్గుముఖం పట్టడంతో దిగువన కొవ్వూరు పరిసర ప్రాంతాల్లో గోదావరి నీటిమట్టం పెరుగుతుంది. దీంతో గోష్పాదక్షేత్రంలో స్నానఘట్టాల్లో ఏర్పాటు చేసిన శివలింగాలను వరద ముంచెత్తింది.

ఇంజనీరింగ్ సీట్ల లెక్క తేలింది..

- జేఎన్టీయూకే పరిధిలో సీట్లు ఖరారు
- 2025-26 విద్యాసంవత్సరానికి 106 కళాశాలలకు గుర్తింపు
- నూతనంగా రెండు ఇంజనీరింగ్ కళాశాలలు
- ఇంజనీరింగ్‌లో సుమారు 30వేల సీట్లకు అనుమతి
- 18 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు

జేఎన్టీయూకే, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు ఎప్పుడు జరుగుతాయని ఎదురుచూస్తున్న విద్యార్థులకు కళాశాలల్లో ప్రవేశాలకు లైన్ క్లియర్ కానుంది. ఏపీఈఏపీసెట్‌కు సంబంధించిన వెబ్ కౌన్సెలింగ్ ఈనెల 7న ప్రారంభమైంది 16 వరకూ ఆన్‌లైన రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, 17 వరకూ ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన కొనసాగనుంది. వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈనెల 18 వరకూ కొనసాగనుంది. రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాల నుంచి ఇంజనీరింగ్ సీట్ల సంఖ్యపై ఉన్నత విద్యామండలికి నివేదిస్తేనే అక్కడ నుంచి కౌన్సెలింగ్‌కు సంబంధించిన నోటిఫికేషన్ వస్తుంది. రాష్ట్రంలోని అత్యధిక కళాశాలలకు అనుసంధానంతో పాటూ సాంకేతిక వర్సిటీల్లో రాష్ట్రంలో కీలకంగా ఉన్న జేఎన్టీయూకే ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి నివేదికను పంపించారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఇంజనీరింగ్ కళాశాలలు విశ్వవిద్యాలయానికి అనుభందంగా ఉన్నాయి.

106 కళాశాలలకు గుర్తింపు

2025-26 విద్యాసంవత్సరానికి జేఎన్టీయూకే ఉన్నత విద్యామండలికి సీట్ల కేటాయింపు కోసం నివేదించింది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న 106 కళాశాలల్లో ఇంజనీరింగ్‌లో సుమారుగా 30వేల సీట్లు భర్తీ చేసుకోవడానికి అనుమతి ఇచ్చారు. అయితే గతేడాది మాదిరిగానే ఈ విద్యాసంవత్సరం కూడా విద్యార్థులు సీఎస్ఈ, ఏఐ వైపు మొగ్గుచూపుతున్నారు.

ఆన్‌లైన్‌లో కళాశాలల తనిఖీ

ఏపీఎస్‌హెచ్ఈ ఆదేశాల మేరకు వర్సిటీ అనుబంధ కళాశాలల తనిఖీలు ఆన్‌లైన్‌లో చేపట్టారు. కళాశాలలోని వసతులు, స్థితిగతులు, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, విద్యార్థి- అధ్యాపకుల నిష్పత్తి, ఆట స్థలం, కళాశాల క్యాంపస్ పరిస్థితి, గ్రంథాలయ సదుపాయం, ల్యాబ్‌లు తదితర అంశాలను నిజనిర్ధారణ కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ) పర్యవేక్షణ చేస్తుంది. ఈ కమిటీ సిఫార్సు మేరకు ఏఏ కళాశాలలకు ఎన్ని సీట్లు కేటాయించాలి అనే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. అంతేకాకుండా ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్న ఇంజనీరింగ్ కళాశాలలకు ఎన్నిసీట్లకు యూనివర్సిటీ అనబంధ గుర్తింపు ఇస్తుందనే అంశానికి ఎఫ్ఎఫ్‌సీ సిఫార్సులే కీలకం. అయితే ఈ కమిటీలో వర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు సభ్యులుగా ఉంటారు. ఏపీఈఏపీసెట్ వెబ్ ఆప్షన్లపై సందిగ్ధత వీడింది.

జేఎన్టీయూకే పరిధిలో 164 కళాశాలలుండగా వాటిలో 106 ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లను భర్తీ చేయనున్నారు. 4 కళాశాలలు డీమ్డ్ యూనివర్సిటీలుగా, 8 కళాశాలలు జీరో ప్రవేశాల కారణంగా, రెండు కళాశాలలు మెర్జ్ కాగా మరొక కళాశాలను మూసివేశారు. 34 ఫార్మసీ కళాశాలలు, 9 ఎంబీఏ, ఎంసీఏ మేనేజ్‌మెంట్ కళాశాలలున్నాయి. అయితే ఈ ఏడాది రెండు నూతన ఇంజనీరింగ్ కళాశాలలు అనుమతి పొందాయి.

ఉన్నత ప్రమాణాలున్న కళాశాలలకే గుర్తింపు



ఏపీ ఉన్నత విద్యామండలి రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కళాశాలల ప్రమాణాలను ఆన్‌లైన్ ద్వారా పరిశీలన చేసి అనుమతి ఇవ్వాలని సూచించింది. వాటి ప్రకారం కాకినాడ జేఎన్టీయూ నుంచి ఆన్‌లైన్‌లో పరిశీలన నిర్వహించాం. సాంకేతిక విద్యలో ఉన్నతప్రమాణాలు పాటించిన అన్ని వసతులు ఉన్న కళాశాలలకే గుర్తింపునిచ్చాం. ఆ విధమైన కళాశాలల్లో అభ్యసిస్తే విద్యార్థులకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

జేఎన్టీయూకే ఉపకులపతి,
ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్

శాకంబరిగా తలుపులమ్మ


శాకంబరి దేవిగా తలుపులమ్మ


క్యూలో బారులుతీరిన భక్తులు

తుని రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢమాస మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారు శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు ప్రత్యేక క్యూలలో బారులుతీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో వంటా వార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.17.3 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో తెలిపారు.

లోవ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

రూ.17.3 లక్షలు ఆదాయం

ఆలయానికి విరాళం

లోవ దేవస్థానంలో ఆలయ పునఃనిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. పిట్లపాలెం గ్రామానికి చెందిన దాసరి నాగేశ్వరరావు, బుల్లమ్మ దంపతుల కుమారుడు సాయి నాయుడు రూ.లక్షా116 విరాళం అందజేశారు. అనంతరం వారికి ఆలయ పండితులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.

1.10 లక్షల సత్యదేవుడి ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు

రూ.22 లక్షల ఆదాయం

అన్నవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తలుపులమ్మ లోవ నుంచి తిరుగు ప్రయాణంలో స్వస్థలాలకు వెళ్లే భక్తులు అన్నవరం సత్యదేవుడి ప్రసాదానికి బారులు తీరారు. ఆదివారం కొండపైన, కొండదిగువన ఉన్న ప్రత్యేక కౌంటర్ల ద్వారా 1.10 లక్షల ప్యాకెట్లు విక్రయించగా రూ.22 లక్షల ఆదాయం లభించినట్టు అధికారులు తెలిపారు.

భీమేశ్వరాలయంలో శాకంబరి ఉత్సవం


శాకంబరిగా దర్శనమిస్తున్న మాణిక్యాంబ, శోభాయాత్రలో పాల్గొన్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో అష్టాదశశక్తి పీఠం మాణిక్యాంబ అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయంలో శాకంబరి ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట ఆస్థాన మండపం నుంచి దేవస్థానం ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, చీర, సారె మంగళవాయిద్యాలతో శోభాయాత్ర ప్రారంభించారు. ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ అర్చకులు, సిబ్బంది, సేవా భక్తులు, 150 కిలోల సారె సమర్పించిన కంచర్ల చక్రి, సారె సమర్పించిన ఇతర భక్తులు పాల్గొన్నారు. అన్నాయిపేట వద్ద మంత్రి సుభాష్ హాజయ్యారు. అనంతరం ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి మాణిక్యాంబకు చీర,సారె సమర్పించారు. కార్యక్రమంలో వాడ్రేవు సుందర రత్నాకరరావు, సత్యంవాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం భీమేశ్వరస్వామి దేవస్థానం తరపున వెలంపాలెంలో గోగులమ్మవారికి సారె సమర్పించారు.

సీజ్ చేసిన బోటు దొంగతనం

కేసు నమోదు చేసిన కొవ్వూరు పోలీసులు

కొవ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన మెకనైజ్డ్ డ్రెజ్జింగ్ బోటు దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలో గత నెల జూన్ 2న అఖండ గోదావరి కుడిగట్టు విభాగం ఏఈ జి. మణికంఠరాజు, రెవెన్యూ, జిల్లా టాస్క్‌ఫోర్సు బృందంతో కలిసి ఇసుక ర్యాంపులు తనిఖీ నిర్వహించారు. దండకుంట వుంత ఇసుకర్యాంపు-2లో అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న 2 మెకనైజ్డ్ డ్రెజింగ్ బోట్లు వెరోనికా శ్రీలోహితాక్ష, పేరు తెలియని బోటును సీజ్ చేసి అధికారుల కస్టడీలో ఉంచారు. ఈనెల 11న వెరోనికా శ్రీలోహితాక్ష డ్రెజ్జింగ్ బోటు కనిపించకపోవడంతో పల్నాడు జిల్లా అమరావతి మండలం ధరణికోటకు చెందిన బుడ్డి రవికుమార్, కృష్ణాజిల్లా గొల్లపూడికి చెందిన పీత వెంకట రామారాజు బోటును దొంగతనం చేశారని ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

మామపై అల్లుడు కత్తితో దాడి

కరప, జూలై 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో ఆదివారం మధ్యాహ్నం వరుసకు మామ అయిన వ్యక్తిపై అల్లుడు కత్తితో దాడి చేసి గాయపర్చాడు. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరప గ్రామానికి చెందిన భేరి చంద్రశేఖర్‌కు అతడి చిన్నాన్న భేరి రామకృష్ణకు మధ్య గత కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. రామకృష్ణ కుమారుడు వృత్తిరీత్యా కుటుంబంతో సహా తునిలో ఉంటున్నాడు. అతడి మావయ్య బిక్కవోలుకి చెందిన అమజాల వీరరాఘవ ఆదివారం మధ్యాహ్నం భోజనం క్యారేజ్ పట్టుకుని కరపలో ఉన్న వియ్యంకుడు రామకృష్ణ ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఆస్తి విషయమై ఇరువర్గాల మధ్య మరోసారి రచ్చ జరిగింది. ఈ క్రమంలో చంద్రశేఖర్, అతడి తల్లి రాజరాజేశ్వరి, వియ్యంకుళ్లు రామకృష్ణ, వీరరాఘవలు పరస్పరం వాగ్వాదం చేసుకోవడంతో ఘర్షణ జరిగింది. ఆవేశం పట్టలేని చంద్రశేఖర్ కత్తితో వీరరాఘవపై దాడి చేసి ఎడమచేతిపై రెండు చోట్ల నరకడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు స్పందించి బాధితుడిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ తోట సునీత హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

కాకినాడ జీజీహెచ్‌లో విద్యార్థినులపై లైంగిక వేధింపులు..

నలుగురు నిందితులకు పోక్సో కేసులో రిమాండ్

రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కి తరలింపు

జీజీహెచ్ (కాకినాడ), జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన రోగ నిర్ధారణ ల్యాబ్‌లకు చెందిన ఉద్యోగులకు రెండు సెక్షన్‌లలో బెయిల్ వచ్చినా మైనర్ బాలికలపై వేధింపులకు గురిచేసిన పోక్సో కేసులో మాత్రం నాన్ బెయిలబుల్ సెక్షన్ కావడంతో బెయిల్ అనివార్యమయ్యింది. వివరాల్లోకి వెళితే కళ్యాణ్ చక్రవర్తి, బి.జిమ్మిరాజు, గోపాలకృష్ణ ప్రసాద్‌లు 55 మంది ఎంఎల్‌టీ విద్యార్థినులను వేధింపులకు గురిచేయగా వారు కొంతకాలం పాటు బిక్కుబిక్కుమని ఎవరికి చెప్పకుండా బాధను దిగమింగుకుని విధులకు హాజరైనా ఆ కీచకుల ఆగడాలు శృతిమించడంతో కళాశాల యాజమాన్యానికి భయంభయంగా మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో కళాశాల ప్రిన్సిపాల్ వేగంగా నిందితులపై పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. దాంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సెక్షన్ 354, సెక్షన్ 519 కింద, అలాగే టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో సెక్షన్ కింద కేసులు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. అయితే 2 సెక్షన్‌లో బెయిల్ మంజూరైనా పోక్సో కేసులో మాత్రం నలుగురికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కి తరలించారు. అయితే నిందితుడు జిమ్మిరాజును కేసు నుంచి తప్పించడం కోసం అతడి మేనమామ బూరిగ ఆశీర్వాదం చేసిన ప్రయత్నం పోక్సో కేసు అవ్వడంతో ఫలించలేదు.

రెండు మోటారుసైకిళ్లు ఢీ

ఇద్దరికి తీవ్రగాయాలు

కొవ్వూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గండిపోచమ్మ ఆలయ మలుపులో ఎదురెదురుగా 2 మోటారుసైకిళ్లు ఢీ కొన్నాయి. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం దివిలికి చెందిన వల్లభశెట్టి వెంకటేష్ పట్టిసీమ వెళ్లి బైక్‌పై తిరిగివస్తున్నాడు. అదే సమయంలో తాళ్లపూడి మండలం రాగోలపల్లికి చెందిన నీరుకొండ పోసిరత్నం కొవ్వూరు నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఇద్దరు కుమారదేవం గండిపోచమ్మ ఆలయం మలుపులో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కొవ్వూరుప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ధాన్యలక్ష్మి ఆలయంలో చోరీ

అమ్మవారి మెడలో నోట్ల దండ, 2 కాసుల బంగారం, రూ.10వేలు అపహరణ

కె.గంగవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం గంగవరం- కోటిపల్లి ప్రధాన రహదారిలో కోట పరిధిలో ఉన్న కోట ధాన్యలక్ష్మి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయం వెనుక భాగాన గోడకు కన్నం పెట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో ఉన్న 4 సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అమ్మవారి మెడలో రూ.4 వేలు విలువ చేసే నోట్లతో తయారు చేసిన దండ, రూ.10 వేలు, 2 కాసుల బంగారు ఆభరణాలు దొంగిలించుకుపోయారు. హుండీని బద్దలు కొట్టారు. ఐతే హుండీలో డబ్బులు ఇదివరకే తీసి వేయడం వల్ల ఏమీ దొరక లేదు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ వెంకటనారాయణ చోరీ ప్రదేశాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ. ఎస్‌కె.జానీబాషా పేర్కొన్నారు.


ఆలయం గోడకు పెట్టిన కన్నం


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యుడు

నాలుగేళ్ల కిందట యువతి అదృశ్యం

కనుగొని తల్లిదండ్రులకు అప్పగించిన కొత్తపల్లి పోలీసులు

కొత్తపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సుమారు నాలుగేళ్ల కిందట అదృశ్యమైన యువతి ఆచూకీని కొత్తపల్లి పోలీసులు కనుగొని ఆమె కుటుంబీకులకు అప్పగించారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండల పొన్నాడ గ్రామానికి చెందిన ఏడిద లోవలక్ష్మి 2021లో ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అప్పుడు కొత్తపల్లి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అదృశ్యమైన కేసుల్లో పూర్తిస్థాయి విచారణ చేపట్టిన నేపథ్యంలో లోవలక్ష్మి హైదరాబాద్‌లో ఉందన్న విషయం కొత్తపల్లి పోలీసులకు చేరింది. దీంతో ఎస్ఐ జి వెంకటేష్ హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న శివరామసుబ్రహ్మణ్యం

అమలాపురం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి వైశ్యసంఘ పచ్చిగోళ్ల జనార్ధనరావు, కొల్లూరి సత్యనారాయణమూర్తి కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకొళపు శివరామసుబ్రహ్మణ్యం ఆదివారం ప్రారంభించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం, అమలాపురం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో వివిధ విభాగాలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు పల్లపోతు బంగారం, కొరుప్రోలు వెంకటేశ్వరరావు, నంబూరి రెడ్డియ్య ప్రారంభించారు. వెరికోస్ వెయిన్స్, గుండె, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రో, స్కిన్, డెంటల్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసన్ విభాగాల వైద్య నిపుణులు వందలాది మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్లడ్ టెస్ట్, బీపీ, ఈసీజీ, ఎకో వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు రోగులకు రూ.3లక్షల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు (బాబి), కార్యదర్శి కుసుమంచి పాపారావు, కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, సంఘ మెడికల్ కమిటీ చైర్మన్ పచ్చిపులుసు కృష్ణారావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సింగంశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు, పోశెట్టి సూరిబాబు, కాసు శ్రీనివాస్, పొలిటికల్ కమిటీ చైర్మన్ లక్కింశెట్టి బాబులు, వారణాశి గుప్తా, కాళ్లకూరి కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మి, అమలాపురం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్య సంఘ అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్,కోశాధికారి కె.వెంకటాచలప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఉష్రశ్రీ ఎంపిక

అమలాపురం టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న అడ్డగళ్ల ఉష్రశ్రీ జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ఢిల్లీలో ఈ నెల 14,15,16 తేదీల్లో జాతీయస్థాయి యోగా పోటీలు జరుగుతాయని, ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి ఉష్రశ్రీ పాల్గొంటారని తెలిపారు.


ఉష్రశ్రీ యోగాసనం

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

రూ.6 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

కొవ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసులలో నేరాలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.6 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని సాంస్కృత పాఠశాల దగ్గరలోని కూల్‌డ్రింక్స్, కూరగాయాల షాపులో ఈనెల 8న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు బద్దలు కొట్టి రూ.3 వేల నగదు, 2.25 లీటర్ల థమ్స్‌అప్ బాటిల్ కేసులు 9, హోమ్ థియేటర్, సిగరెట్ ప్యాకెట్లను దొంగిలించుకుపోయినట్టు షాపు నిర్వాహకుడు తొండ్రంకి కురిమిశెట్టి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో 2 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనానికి పాల్పడిన రాజమహేంద్రవరం నామవరం, మసీదు వద్ద ఎ.బ్లాక్‌కు చెందిన (ప్రసుత్తం కొవ్వూరు మండలం వేములూరులో నివాసం ఉంటున్న) గుడ్ల సతీష్ అలియాస్ పకోడి, తమ్మిశెట్టి సాయి, కొంతమూరుకు చెందిన బొండపల్లి అచ్యుత్ సతీష్‌ను ఈ నెల 12న కొవ్వూరు నందమూరు రోడ్‌లోని బుద్దుడుబొమ్మ సెంటర్‌లో అరెస్టు చేశామన్నారు. వారి నుంచి సుమారు రూ.6 లక్షల విలువైన కొంత చోరీ సొత్తు, ఇతర కేసులకు సంబంధించి 5 మోటారుసైకిల్‌లు, ఆండ్రాయిడ్ ఫోన్, జత వెండి పట్టీలు, బంగారు నక్లెస్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. గుడ్ల సతీష్‌పై కొవ్వూరు పోలీస్‌స్టేషన్‌లో గతంలో 5 కేసులున్నాయని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేయడంలో ప్రావీణ్యం చూపిన సీఐ పి.విశ్వం, ఎస్ఐ పి.రవీంద్రబాబు, సిబ్బంది అబ్బారీబేగ్, జి.అనీల్‌కుమార్, ఆర్.కోట సత్యనారాయణ, కె.జయరాం, ఎస్.గణేష్, ఎస్.కె. వల్లీను జిల్లా ఎస్పీ అభినందించారని చెప్పారు.

పంటకాల్వలో మృతదేహం

తెలంగాణకు చెందిన వ్యక్తిగా గుర్తింపు

మండపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మండపేట మండలం జెడ్. మేడపాడు వంతెన వద్ద పంట కాల్వలో గత 4 రోజుల నుంచి గుర్తుతెలియని మృతదేహం ఉండడంతో స్థానికులు గుర్తించారు. ద్వారపూడికి చెందిన వీఆర్వో బాపూజీ మండపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడి జేబులో లభ్యమైన పాన్‌కార్డు ఆధారంగా గొట్టు ముక్కలకూమార్‌రాజు (45)గా, అతడి ది తెలంగాణ రాష్ట్రం దమ్మయ్య గూడ కేసరి మండలం కె.వి.రంగారెడ్డి జిల్లాగా గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించామని రూరల్ ఎస్ఐ వి.కిషోర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

కంప్యూటర్ ఉచిత శిక్షణ

కాకినాడ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రేచర్లపేటలో మస్జీద్-ఎ అల్ఫురాన్ కమిటీ, ఫైన్ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు కంప్యూటర్ ఉచిత శిక్షణను ప్రారంభించారు. మస్జీద్ ఆవరణలో మొదటి బ్యాచ్‌లో 50 మందికి 15 రోజులు శిక్షణ ఇస్తారు. మస్జీద్ కమిటీ అధ్యక్షుడు నయీం సిద్ధిక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఎండీ జమీల్ అస్గర్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం సంతోషంగా ఉండడమే ధ్యేయం

సుపరిపాలనలో తొలి అడుగు సభలో మంత్రి కొండపల్లి శ్రీనివాసు

సామర్లకోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సంతోషంగా ఉండడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాసు పేర్కొన్నారు. సామర్లకోట మండలం జి.మేడపాడులో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని, తద్వారా నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. గ్రామాల్లో తారు, సీసీ రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలలకు పూర్తిస్థాయిలో తరగతి గదుల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు శరవేగంతో జరుగుతున్నాయన్నారు.

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ పెద్దాపురం నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను నిరంతరం చేస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో అర్ధంతరంగా నిలిపివేసిన పంచాయతీ, రైతు సేవా కేంద్రాల భవనాల నిర్మాణాన్ని తాము పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి శ్రీనుబాబు, తోటకూర శ్రీనివాసు, చీకట్ల వెంకటేష్, ముసి రెడ్డి శ్రీరాములు, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, గుమ్మళ్ల రామకృష్ణ, కుర్రా నారాయణస్వామి, పెంకే వెంకటేష్, పాలకుర్తి రవిబాబు, నున్న సుధాకర్, ఆరిమిల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తెలుగు రైతు కాకినాడ పార్లమెంటరీ చైర్మన్ పాలకుర్తి శ్రీనువాసు పుట్టినరోజు సందర్భంగా టీడీపీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను మంత్రి శ్రీనివాసు, ఎమ్మెల్యే చినరాజప్ప కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

140 సమస్యలను పరిష్కరించాం

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా మరిన్ని ప్రాధాన్యతా సమస్యలను పరిగణలోకి తీసుకోవడం ద్వారా 140 సమస్యలను పరిష్కరించామని మంత్రి కొండపల్లి శ్రీనివాసు పేర్కొన్నారు. విజన్ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే ఇది సాధ్యమైందన్నారు. మండలంలోని జి.మేడపాడులో తెలుగు రైతు కాకినాడ పార్లమెంటరీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు ఇంట్లో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తూ చిన్నతరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బోళ్ల వెంకటరమణ, తోటకూర శ్రీనివాసు, పాలకుర్తి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకే చాతుర్మాస్య దీక్ష

మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి

పిఠాపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పిల్లలు, పెద్దలు అందరూ ఎన్నో ఒత్తిడులతో జీవనం సాగిస్తున్నారని, దాని నుంచి ఉపశమనం పొంది ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చాతుర్మాస్య వ్రత దీక్ష దోహదం చేస్తుందని మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి అన్నారు. పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ అనఘా దత్త క్షేత్రంలో చాతుర్మాస్య వ్రత దీక్ష చేస్తున్న ఆయన నాలుగో రోజైన ఆదివారం పలు పూజలు చేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహభాషణ చేస్తూ అన్ని దీక్షల్లో చాతుర్మాస్య దీక్ష శ్రేష్ఠమైనదన్నారు. ఇది సన్యాసులు మాత్రమే చేయాల్సినది కాదని... బ్రహ్మచారులు, గృహస్థులు, వానప్రస్థులు కూడా చేయవచ్చని చెప్పారు. చాతుర్మాస్య దీక్ష



నాలుగు నెలలు ఉంటుందని, కనీసం రెండు నెలలు ఒకచోట ఉండి నిత్యం భగవన్నామస్మరణ చేస్తూ సత్కార్యాలు చేయాలని సూచించారు. భగవంతుడి అనుష్ఠానం భూమిని కాపాడుతుందని తెలిపారు. అనఘా దత్త క్షేత్రంలో నవకోటి దత్తయాగ మహా సంకల్పంలో భాగంగా అష్టమకోటి దత్త యాగం నాలుగో రోజూ కొనసాగింది. వేద పండితులు, వేద పాఠశాల విద్యార్థులు యజుర్వేద ఘన పారాయణం సాగించారు. అనఘాదత్త స్వామికి తైలాభిషేకం నిర్వహించారు. ఆదివారం ఆయుర్వేద, అల్లోపతి వైద్య శిబిరాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. పల్లకీ సేవ జరిగింది. ఆలయ కమిటీ, మైసూరు దత్త పీఠం ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

‘చేతివృత్తి కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి’

సామర్లకోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తుల్లో ప్రధానమైన కార్పెంటర్లు, వండ్రంగి కార్మికులను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కాకినాడ జిల్లా కార్పెంటర్లు, వడ్రంగి సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. సంఘ అధ్యక్షుడు రామోజు కాశీవిశ్వనాథం అధ్యక్షతన ఆదివారం వేట్లపాలెంలో నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. వీటిని రాష్ట్ర నాయకులతో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మురుపాక రమణ, అధ్యక్షుడిగా ధవళేశ్వరపు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా అనుమంచిపల్లి బ్రహ్మాజీ, కోశాధికారిగా మదిని సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా గుంటముక్కల ఆనందరావులను ఎన్నుకున్నారు.

రాష్ట్ర నాయకులు ఆవుపాటి ఉమాశంకర్, అత్తిలి వీరబ్రహ్మం, వేముల అర్జునరావు, గొట్టి దుర్గాప్రసాద్, వేముల మంగపతి, మునాసూరి శంకరాచార్యులు, కొమ్మోజు సత్యనారాయణ, పాలా శివదుర్గ, దివిలి సత్యనారాయణ, దివిలి శ్రీరామమూర్తి, పట్నాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో నూకాంబిక



గొల్లప్రోలు దేవీనగరంలో...



పెద్దాపురంలో నూకాలమ్మ

శాకంబరిగా అమ్మవార్ల దర్శనం

సామర్లకోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట గ్రామ దేవత నూకాంబిక శాకంబరిగా దర్శనమిచ్చారు. మూడు టన్నుల కూరగాయలతో అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించారు. భీమేశ్వర దీపారాధన సంఘం సభ్యుల సౌజన్యంతో దాతల నుంచి సేకరించిన కూరగాయలను ప్రత్యేక ఆకృతుల్లో దండలుగా కట్టారు. ఆలయ ఆవరణలోని అన్ని గ్రామ దేవతామూర్తుల విగ్రహాలకు కూడా కూరగాయల దండలు వేశారు. సామర్లకోట పట్టణం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేవీనగరంలో కొలువైయున్న శ్రీదేవి అమ్మవారికి శాకంబరీ అలంకారం చేశారు. పండ్లు, కాయగూరలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారం కాండ్రకోట నూకాలమ్మను పలు రకాల కూరగాయలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారిని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో రాంబాబురెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి సారె సమర్పించారు.





గురజనాపల్లిలో ఎక్సకవేటర్‌తో డ్రెయిన్ పూడిక తీయిస్తున్న దృశ్యం, పనులు నిలిపివేయాలంటున్న సాల్ట్ ఆఫీసర్‌తో మాట్లాడుతున్న జనసేన నాయకులు

సాల్ట్ డిపార్ట్‌మెంట్ అధికారుల అత్యుత్సాహం

» అనుమతి లేదంటూ డ్రెయిన్ తవ్వకం పనుల అడ్డగింత » సొంత నిధులతో బాగుచేస్తుంటే ఆపడంపై రైతుల ఆగ్రహం

కరప, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అమ్మ పెట్టదు... అడుక్కు తిననివ్వదు... అన్నట్టు ఉంది సాల్ట్ డిపార్ట్‌మెంట్ అధికారుల తీరు చూస్తుంటే. ఆ శాఖ పరిధిలోని సాల్ట్ భూముల్లో పూడుకుపోయిన ఒక డ్రెయిన్‌ను కొంతమంది జనసేన నాయకులు అనేక వ్యయప్రయాసలకోర్చి బాగు చేయిస్తున్నారు. వాస్తవానికి ఆ పని చేయాల్సిన అధికారయంత్రాంగం పత్తాలేకుండా పోవడంతో రైతుల ప్రయోజనాన్ని కాంక్షించి ఎమ్మెల్యే వినతి మేరకు నాయకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. లక్షలాది రూపాయలు వెచ్చించి డ్రెయిన్ పూడిక తీయిస్తున్నందుకు వారిని అభినందించాల్సింది పోయి అనుమతి లేకుండా డ్రెయిన్ ఎందుకు తవ్వుతున్నారని అధికారులు ఎదురు తిరగడంతో ఆ నాయకులు షాక్‌కు గురయ్యారు. వివరాల్లోకి వెళితే...

కరప మండలం గురజనాపల్లి, పెనుగుదురు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో వందలాది ఎకరాల సాల్ట్ భూములున్నాయి. ఈ భూముల్లోంచి ఉన్న డ్రెయిన్ బాగా పూడుకుపోయి భారీ వర్షాలు, వరదల సమయాల్లో ఎగువనున్న పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. పలువురు రైతులు ఎమ్మెల్యే పంతం నానాజీని కలిసి తమ దుస్థితిని వివరించారు. నిధుల లేమి కారణంగా డ్రెయిన్‌లో పూడికతీత పనుల బాధ్యతను ఎమ్మెల్యే స్థానిక జనసేన నాయకులకు అప్పగించారు. వారితో పాటు స్థానికంగా ఉన్న ఒక ఫ్యాక్టరీ యజమాని సహకారంతో 20 రోజుల క్రితం పాతర్లగడ్డ వెంకటప్పయ్య డ్రెయిన్ నుంచి గురజనాపల్లి వంతెన వరకు మిషన్‌తో డ్రెయిన్ పూడికతీత పనులు చేపట్టారు. లక్షలాది రూపాయలతో స్వచ్ఛందంగా చేపట్టిన ఈ పూడికతీత పనులు దాదాపు ముగింపు దశకు వచ్చిన సమయంలో ఉప్పు శాఖాధికారులు రంగప్రవేశం చేశారు. ఎటువంటి అనుమతి తీసుకోకుండా తమ పరిధిలో ఉన్న డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే పనులు నిలిపివేయాలని, లేకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతటితో ఆగకుండా పోలీసులు, రెవెన్యూ శాఖాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఎంతో ఉత్సాహంగా పనులు చేయిస్తున్న నాయకులు కంగుతిన్నారు. వరదలు, అధిక వర్షాల సమయంలో పంట పొలాల ముంపు ముప్పును నివారించడానికి ఈ పూడికతీత పనులు చేయిస్తుంటే అధికారులు అడ్డుకోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లోని వందలాది ఎకరాల సాల్ట్ భూములు అన్యాక్రాంతమవుతున్నా, అందులో అక్రమంగా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నా, అడ్డగోలుగా మట్టి తరలించుకుపోతున్నా సదరు అధికారులు ఏనాడూ పట్టించుకోలేదు. అలాంటిది పూడుకుపోయిన డ్రెయిన్‌ను సొంత నిధులతో తవ్వుకుంటుంటే అడ్డుకుంటారా అని పలువురు మండిపడుతున్నారు. అంతిమ దశలో ఉన్న పనులను అనుమతులు లేవనే కారణంతో ఆపొద్దని జనసేన నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే నానాజీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పనులు సక్రమంగా పూర్తయ్యేలా చూడాలని కోరారు.

కాకినాడ సెజ్‌లో పరిశ్రమలు పెట్టాలి

లేదా నిరుపయోగంగా ఉన్న భూములను రైతులకు ఇచ్చేయాలి: సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు డిమాండ్

కాకినాడ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సెజ్‌లో పరిశ్రమలు పెట్టాలి లేదా నిరుపయోగంగా ఉన్న వేల ఎకరాల భూములను రైతులకు తిరిగి ఇచ్చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. నగరంలోని పీఆర్ భవన్‌లో ఆదివారం సీపీఐ కాకినాడ నగర 23వ మహాసభ పప్పు ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మధు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. కేఎస్ఈజెడ్‌లో పరిశ్రమల జాడ కనిపించట్లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా పరిశ్రమల ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. 2003లో కాకినాడ సెజ్ ఏర్పడగా 2,587 ఎకరాల పరిధి మేరకే కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం 5,120 ఎకరాలను



సమావేశంలో మాట్లాడుతున్న మధు

రైతుల నుంచి బలవంతంగా సేకరించిందని ఆరోపించారు. 19ఏళ్లు దాటుతున్నా పరిశ్రమలు రాకపోగా భూములన్నీ ఖాళీగానే ఉన్నాయన్నారు. పట్టుమని పది ఎకరాల విస్తీర్ణంలో కూడా కార్యకలాపాలు కనిపించట్లేదన్నారు. రూ.32కోట్లతో కాకినాడ పెట్రో కారిడార్ పేరుతో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తామని కేంద్రం చెప్పడం తప్ప పనులు జరిగిన దాఖలాలు లేవన్నారు. సెజ్ రైతుల సమస్యలు పరిష్కరిస్తానని పిఠాపురం పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రస్తావించారని, అయితే ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని మధు విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే వ్యతిరేకించాలని, వారి ముందే వాటిని బద్దలుకొట్టాలని పిలుపునిచ్చారు. నగర కార్యదర్శి టి.అన్నవరం, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.భవాని, పలు సంఘాల నాయకులు రాంబాబు, జయకుమార్, కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత సీపీఐ సీనియర్ నేత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పొన్నమండ రామచంద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఘంటసాల అవార్డు గ్రహీత శ్రీరాములును సత్కరిస్తున్న దృశ్యం

అలరించిన సంగీత విభావరి

పిఠాపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్యరాయ గ్రంథాలయ ఆవరణలో గల పీఠికాపుర కళా వేదికపై నిర్వహించిన గానగంధర్వ ఘంటసాల వెంకటేశ్వరరావు పాటల సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. ఘంటసాల అవార్డు గ్రహీత మేడిశెట్టి శ్రీరాములు, విత్తనాల మురళీకృష్ణ గీతాలను ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం శ్రీరాములును సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం, వివిధ సంస్థల ప్రతినిధులు సత్కరించారు. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, వివిధ సంఘాల ప్రతినిధులు అల్లవరపు నగేష్, గట్టి శ్రీకృష్ణదేవరాయ, పోలుపర్తి వేణు, కేవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పిఠాపురంలో పీజీఆర్ఎస్

పిఠాపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆమె ఆదేశించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే సుబ్బరాజు ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

తాళ్లరేవు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ‘తల్లికి వందనం’లో సొమ్ము తీసుకున్న తల్లులు పోలేకుర్రు పంచాయతీ జైభీమ్‌పేటలో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఫ్లెక్సీలకు ఆదివారం పాలాభిషేకం చేశారు. జైభీమ్‌పేట, సుంకటరేవు గ్రామాల్లో ఐవీఎల్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.24లక్షలతో రెండు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే సుబ్బరాజు శంకుస్థాపన చేశారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తోందన్నారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, జక్కల ప్రసాద్‌బాబు, వుంగరాల వెంకటేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, ధూళిపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉన్న మాటంటే కరుణాకరరెడ్డికి ఉలుకెందుకు

టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ రవి



కాకినాడ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల స్వామివారి దర్శనానికి విచ్చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొండపై వెయ్యి మంది అన్యమతస్తులు ఉన్నారంటే టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డికి ఉలుకెందుకని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ హోతా రవి అన్నారు. జగన్నాథపురంలోని సమితి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన హయాంలో జరిగిన అరాచకాలు బయటకు వస్తాయనే కరుణాకరరెడ్డి గుమ్మడికాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకుంటున్నారన్నారు. కొండపై 22 మందే అన్యమతస్తులు ఉన్నారని బుకాయింపు మాటలకు దిగారన్నారు.



చెక్కు అందజేస్తున్న శేఖర్

చిన్నారుల చదువు నిమిత్తం

రూ.54వేలు ఆర్థిక సహాయం

కాకినాడ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్తోమత లేని చిన్నారుల చదువు నిమిత్తం కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామానికి చెందిన యాళ్ల శేఖర్ తన పుట్టినరోజు సందర్భంగా శ్రీయువసేన సహాయ నిధికి రూ.54వేలు చెక్కు అందించారు. మెయిన్ రోడ్‌లోని శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌కు ఆదివారం విచ్చేసిన శేఖర్ కేక్ కట్ చేసి చెక్కును బ్లడ్ బ్యాంక్ చైర్మన్ బొల్లం సతీష్‌కు అందజేశారు. యాళ్ల విజయ్‌నాయుడు, మురళీ, సంతోష్, వాసు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం

కాకినాడ టౌన్ హాల్‌లో

రక్తదాన శిబిరం

కాకినాడ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ టౌన్ హాల్‌లో లోకల్ బిజినెస్ నెట్వర్క్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో 3వ మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు రవితేజ అధ్యక్షత వహించగా లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు రక్తదాతలను అభినందించారు. సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ సిరాజ్, కార్యదర్శి ఏవీవీ సతీష్‌కుమార్, లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, డైరెక్టర్ అంకూర్ సురానా. రామ్‌కుమార్, కిరణ్, రాజు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో లేకుంటే చర్యలు

పిఠాపురం సీఐ శ్రీనివాస్

పిఠాపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): హిస్టరీ షీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణ పోలీసుస్టేషన్ వద్ద ఆదివారం నియోజకవర్గ పరిధిలోని హిస్టరీ షీటర్లతో సమావేశం నిర్వహించారు. ఏ విధమైన గొడవలు, కొట్లాటల్లో ఇన్‌వాల్వ్ కావద్దని సూచించారు. వివాదాల్లో తలదూర్చినా, కేసుల్లో ఇరుక్కొన్నా వారి బెయిల్ రద్దుకు కోర్టులను కోరతామని స్పష్టం చేశారు. అనంతరం కౌన్సిలింగ్ నిర్వహించగా 45 మంది రౌడీషీటర్లు, 25 మంది సస్పెక్ట్ షీటర్లు హాజరయ్యారు. ఎస్ఐలు మణికుమార్, జానీబాషా, ఎస్.రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురప్పాడు ఉప సర్పంచ్

అనారోగ్యంతో మృతి



శ్రీనివాస అప్పారావు (పాత చిత్రం)

కరప, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపురప్పాడు గ్రామ ఉప సర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు (56) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన భార్య సరస్వతి ప్రస్తుతం ఇదే గ్రామానికి సర్పంచ్‌గా పని చేస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు వున్నారు. గతంలో పెద్దాపురప్పాడు నీటి సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. 2021 ఫిబ్రవరిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో జనసేన మద్దతుతో భార్యను సర్పంచ్‌గా, తాను వార్డు సభ్యుడిగా నిలబడి విజయకేతనం ఎగురవేశారు. జనసేనకు కంచుకోటగా నిలిచిన ఈ గ్రామంలో పదికి పది వార్డులను గెలుచుకోవడం అప్పట్లో సంచలనమైంది. ఎన్నికలు ముగిసిన కొద్ది నెలలకు అప్పారావు కిడ్నీలు పూర్తిగా పాడైపోగా భార్య కిడ్నీ దానం చేయడంతో కోలుకున్నారు. అప్పారావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. శ్రీనివాసఅప్పారావు కుటుంబసభ్యులను మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు బొండా చంటిబాబు, బిరుదా వీరభద్రరావు తదితరులు పరామర్శించి సానుభూతి తెలిపారు.

‘కోట శ్రీనివాసరావు మృతి తీరని లోటు’

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినీ, నాటక జగత్తులకు తీరని లోటని అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు పేర్కొన్నారు. నగరంలోని దంటు కళా క్షేత్రంలో ఆదివారం జరిగిన పరిషత్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో శ్రీనివాసరావు మృతికి ప్రగాఢ సంతాపం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించారు. గౌరవాధ్యక్షులు కర్రి భామిరెడ్డి, అధ్యక్షుడు కర్రి అచ్యుతరామారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఎస్‌వీ బాపిరాజు, ట్రెజరర్ నూకరాజు, టీవీఎస్ఎన్ రెడ్డి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

‘సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యం’

సర్పవరం జంక్షన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా అన్నారు. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట, పండూరుల్లో వేర్వేరుగా జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు ప్రచారాల్లో వారు పాల్గొన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ప్రకాష్‌గౌడ్, టీడీపీ నాయకులు రామదేవు సీతయ్యదొర, ఏటుకూరి నాగమణి, గుమ్మళ్ల శ్రీనివాస్, గుమ్మళ్ల వీరబాబు, నందిపాటి సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఆదివారం ఆయన కొమరగిరి శివారు పెదకలవలదొడ్డిలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. అనంతరం సెంటర్లో రచ్చబండ నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలు స్వీకరించారు. మాజీ జడ్పీటీసీ బత్తుల చైతన్యరాజేష్ కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రాయుడు శ్రీరాములు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూరాడలో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ఎప్పుడూ అండగా నిలవాలని ప్రజలను కోరారు. మాజీ ఎంపీటీసీ పితాని జయరాం, కూటమి నాయకులు వెలుగుబంట్ల వీరనాగేశ్వరరావు, వెలుగుబంట్ల గంగాధర్, కృష్ణ గుబ్బల శ్రీను, టేకుమూడి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

‘చదవడం మాకిష్టం’

కాకినాడ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివేకానంద పార్కులో గల గాంధీనగర్ శాఖ గ్రంథాలయంలో ఆదివారం లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ‘గ్రంథాలయంలో చదవడం మాకిష్టం’ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రతి ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మద్దాలి రఘురాం రచించిన ‘తెలుగు భాషా వైభవం’ పుస్తకంపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తునిరూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలో వివిధ సెంటర్లలో ఆదివారం తునిటౌన్ సీఐ గీతా రామకృష్ణ, ఎస్ఐ విజయబాబు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. హెల్మెట్లు ధరించని వాహనాదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనాదారుల రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆటో డ్రైవర్లకు ఓవర్ లోడింగ్‌పై అవగాహన కల్పించారు. వాహనదారులు రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే శిరీషదేవి

ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో ప్రభుత్వం ముందడుగు

● రాష్ట్ర సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

రంపచోడవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధిలో ముందడుగులో ఉందని రాష్ట్ర సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రంపచోడవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసం దర్భంగా మంత్రి శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే శిరీషదేవీ, మఠంభాస్కర్ దంపతులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శిరీషదేవీతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభి వృద్ధి కార్యక్రమాలపై వివరించారు. కూటమి ఏడాదిపాలనలోనే అదోగతి పాలైన రాష్ట్రం గాడిలో పడిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, యవతకు ఉద్యోగ అవకాశాలు, ప్రజలకు సంక్షేమ పథకాల అమలు జరు గుతుందని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, శీతం శెట్టి వెంకటేశ్వరరావు, బాబూరమేష్ పాల్గొన్నారు.

తొలి ఏడాదిలోనే సుపరిపాలన



కుసుమనపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న చందు

ఎటపాక: కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిపాలనలోనే సుపరిపాలనగా సాగుతుందని, ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని ఎటపాక క్లస్టర్ ఇంచార్జ్ వల్లభనేని చందు అన్నారు. తోటపల్లి, కుసుమనపల్లి, నల్లకుంట, విస్సాపురం, తదితర గ్రామాల్లో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా చందు ఇంటింటి ప్రచారంలో ప్రభుత్వ పథకాలు, చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. విస్సాపురం మాజీ ఎంపీటీసీ నిడదవోలు సూర్యనారాయణ, పూసం రాఘవయ్య, దుద్దుకూరి సతీష్, అపకా రాంబాబు పాల్గొన్నారు.

'లిట్స్‌తో మౌలిక సదుపాయాలు'



ఆదివాసీల సమస్యలు తెలుసుకుంటున్న డైరెక్టర్ ఏసురత్నం

చింతూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): లిట్స్ సంస్థ తమ గ్రామాలను దత్తత తీసుకొని విద్యతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించడం ఆనందదాయకమని ఆదివాసీలు పేర్కొన్నారు. ఆదివారం చిమిలివాగు గ్రామంలో లిట్స్ డైరెక్టర్ ఏసురత్నం ఆదివాసీలతో మమేకమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ లిట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఎఫ్ఎఫ్ వీడీపీ ప్రోగ్రాం (కుటుంబ కేంద్రీకృత గ్రామ అభివృద్ధి కార్యక్రమం) ఏర్పాటుచేసి ఏడు ఆదివాసీ గ్రామాలను దత్తత తీసుకొని విద్యతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించడం ఆనందదాయక మన్నారు. ప్రధానంగా సోలార్‌ద్వారా విద్యుత్ సరఫరా, తాగునీరు వసతి కల్పించడంతో తమ ప్రధాన సమస్య తీరిందన్నారు. అదే దశలో పాఠశాలలు ఏర్పాటుచేసి ఒక్క డ్రాప్ అవుట్ కూడా లేకుండా ప్రతి చిన్నారికీ చదువు చెప్పడం జరుగుతోందన్నారు. మరోవైపు తమకు కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం, ఆర్థిక స్థోమత లేకపోవడంతో చదువులు మధ్యలో ఆగిపోతున్న విషయం తెలుసుకున్న సంస్థ డైరెక్టర్ అయా విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం కల్పించి వారిని చదివించడం జరుగుతోందన్నారు. మరుగుదొడ్లు, వృద్ధులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, వ్యవసాయ రుణాలు, వ్యవసాయ పరికరాలు అందించడం అభినందనీయమన్నారు. గ్రామకమిటీ సభ్యులు పద్దం మాసయ్య, కుంజా జోగయ్య, మడకం ఉంగయ్య, పద్దం లక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

'కోయ భాషను జాతీయ భాషగా గుర్తించాలి'



ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తున్న ఆదివాసీ విద్యార్థులు

చింతూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోయభాషను జాతీయ భాషగా గుర్తించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్య దర్శి సోడె మురళి డిమాండ్ చేశారు. ఆదివారం చింతూరు ఆదిమ గురుకుల పాఠశాలలో కోయభాష ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడారు. ప్రతి ఏటా జూలై 21న నిర్వహించనున్న విశ్వ గోండీ భాషా దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. దేశం మొత్తం మీద మూడు కోట్ల మంది ఆదివాసీలు గోండి భాషలో మాట్లాడుతన్న క్రమంలో జాతీయ భాషగా గుర్తించాల్సి ఉందన్నారు. ఆదివాసీ ప్రాంతాలలో ప్రాథమిక విద్య కోయభాషలోనే బోధించాలన్నారు. ఈమేరకు ఆదివాసీ యువతను ఉపాధ్యా యులుగా నియమించాలన్నారు. సంఘ నాయకులు శీలంకృష్ణ, మినప నాగేశ్వరరావు, సోడె వెంకటేశ్వర్లు, సోడె రాఘవయ్య, లోకేష్ పాల్గొన్నారు.

కోయ భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

దేవీపట్నం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోయ భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చి కోయ భాష పండిట్లను నియమించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో కోయ భాష పరిరక్షణ కమిటీ జాతీయ సమన్వయకర్త మడివి నెహ్రూ మాట్లాడుతూ ఆనాడు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుచేసే సమయంలో భారతదేశంలో 14రాష్ట్రాల్లో ఉన్న ఆదివాసీలకు ప్రత్యేక ఆదివాసీ స్వయంపాలన రాష్ట్రం ఏర్పాటుచేయకుండా అప్పటినుంచి రాష్ట్రాలు, జిల్లాల విభజనల ప్రాజెక్టు నిర్మాణం పేరుతో ఆదివాసీలను చిన్నాభిన్నం చేస్తున్నారే తప్ప హక్కులు, చట్టాలు పరిరక్షణ కోసం చర్యలు తీసుకోలేదన్నారు. ఈనెల 21న గ్రామ గ్రామాన కోయభాష దినోత్సవ వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ నాయకులు కంగాల శ్రీనివాస్, రామారావు దొర, కారం రామన్నదొర, మడకం వరప్రసాద్‌దొర, మట్ల కృష్టారెడ్డి, పొడియం పండుదొర పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా టేకులబోరు గ్రామం

కూనవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): నిత్యం జనాలతో కిటకిటలాడే టేకులబోరు ఒక్కసారిగా నిశ్శబ్దమైంది. గోదావరి పెరుగుతుండడంతో ప్రజలు ఎవరికి వారు సామాన్లు సర్దుకునే పనిలో ఉండిపోయారు. మరికొంత మంది ఇప్పటికే ఇంట్లో ఉన్న సామాగ్రిని వేరే ప్రాంతానికి తరలించారు. ఆదివారం గోదావరి తగ్గుముఖం పట్టిన ప్రజలు ఇంకా భయం గుప్పెట్లోనే ఉన్నారు. ప్రధాన రహదారిపై ఎవరూ సంచరించకపోవడంతో గ్రామమంతా నిశ్శబ్దంగా మారింది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేటరూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని మల్లిశాల గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాబోయే రోజులు ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. గ్రామంలో ప్రజలు సీసీ రోడ్లు, డ్రైనేజీలు అడగడం జరిగిందని త్వరలోనే వాటన్నింటిని మంజూరు చేస్తామని వివరించారు. మాత నాగలక్ష్మి ప్రమాదంలో భర్త చనిపోయాడని ఇన్సూరెన్స్ రావడానికి ఇబ్బంది అవుతుందని ఎమ్మెల్యేకు వివరించారు. మంజూరు చేయించేందుకు కృషిచేస్తానని ఆమెకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎస్వీ ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు,పైడిపాల సూరిబాబు, గ్రామసర్పంచ్ లక్ష్మణ్, గాజింగం సత్తిబాబు, అడపా తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.



మల్లిశాలలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక వసతులకు కృషి

● ఎమ్మెల్యే సత్యప్రభ

రౌతులపూడి: సబ్‌ప్లాన్ ఏజెన్సీలోని గ్రామాల్లో మౌళిక వసతులు కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. జల్దాం పంచాయతీ చాకిరేవుపాలెంలో సుపరి పాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని ఏజెన్సీ గ్రామాల ఇన్‌చార్జ్ సోమరౌతు చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించగా, ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు సక్రమంగా అందు తున్నాయంటూ ప్రతిఒక్కరినీ అడిగితెలుసుకున్నారు. ఏజెన్సీ గ్రామాలకు చెందిన మహిళలు రహదారి, డ్రైన్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ముందుగా ఉపాధిహామీ నిధులు పదిలక్షలతో నిర్మించిన సీసీ రహదారి ప్రారంభించి జలజీవన్‌మిషన్ నిధులు 12.90 లక్షలతో ఇంటింటి కుళాయికి చెందిన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ గంటి మళ్ల రాజ్యలక్ష్మి, ఏఎంసీ చెర్మన్ బద్దిమణి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల పైడిరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఉపసర్పంచ్ జి.లోవరాజు, మాజీ ఎంపీపీ ఈటంశెట్టి సూర్యభాస్కరరావు, సింహాద్రి పెదబాబు, ఈగల సత్తిబాబు, ఎంపీడీవో శివరామ కృష్ణయ్య, ఎన్డీయే నేతలు పాల్గొన్నారు.

ఏడాది సుపరిపాలనపై ఇంటింటా ప్రచారం

గండేపల్లి: ఏడాది సుపరిపాలనపై మండలంలోని యర్రంపాలెం, సూరంపాలెం గ్రామాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఏడాదిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుంచే రామకృష్ణ, పోసిన బాబూరావు, ముత్యాల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. మల్లేపల్లి గ్రామంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు తెలగారెడ్డి భద్రరావు ఆధ్వర్యంలో ఇంటింటా పర్యటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నువ్వుల వీరబాబు, పోతుల కృష్ణ, అజ్జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

తునిరూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ పట్టణ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె తుని పట్టణంలోని 23వవార్డులో కౌన్సిలర్ శ్రీదేవితో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు.





ఇంటింటి కుళాయికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, యర్రంపాలెంలో ఏడాది సుపరిపాలనపై ప్రజలకు వివరిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు మోహనరావు

కిర్లంపూడి సొసైటీ చైర్మన్‌గా చినబాబు



కిర్లంపూడి సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కుర్ల చినబాబు

కిర్లంపూడి, జూలై 13(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి సొసైటీ చైర్మన్‌గా కుర్ల చినబాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనతోపాటు బూరుగుపూడి సొసైటీ డైరెక్టర్‌గా పాటంశెట్టి వెంకటలక్ష్మి, వేలంక సొసైటీ డైరెక్టర్‌గా గండే రాయుడు బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ సీఈవో పంపన రమణ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా కుర్ల చినబాబు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా రైతులకు విశిష్ట సేవలందించా రన్నారు. అనంతరం వారిని టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, తూము కుమార్, గుడాల రాంబాబు, కాళ్ల వెంకటేష్, పాటంశెట్టి నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ రవి, కుంచే తాతాజీ, గండే చిన కాశీ, కందా సత్యానందం, కొండరాజులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా నాయుడు

ప్రత్తిపాడు , జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏడిద రెడ్డినాయుడు ఆదివారం రాత్రి ప్రమాణ స్వీకారం చేశారు. గోళ్ళ నాగేశ్వరరావు కార్యదర్శిగా, గుడాల రాజబాబు కోశాధికారిగా మరికొంత మంది కార్యవర్గ సభ్యులతో ఇనస్టాలేషన్ అధికారి లయన్స్ పాస్ట్ గవర్నర్ డి. రాఘవేంద్రరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీఎంజేఎఫ్‌పీడీసీ పీవీన్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు, రెడ్డిలు మాట్లాడుతూ సామాజిక సేవలకు లయన్స్ క్లబ్ సేవలు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ సీహెచ్ ఇందిర, జోన్ చైర్‌పర్సన్ రమణ, పాస్ట్ గవర్నర్ డీవీఎస్ రాజు రమేష్, పాస్ట్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంజనీరు మోహన్, గుడాల వెంకటరత్నం, పంతం సూరిబాబు, పంతం కృష్ణ, ఎం.సంజీవరావు, డి. అవినాష్, ఫకీర్‌రాజు, లయన్స్ గోళ్ళ నాగేశ్వరరావు, డాక్టర్ పవన్ పాల్గొన్నారు.

ఘనంగా వేగులమ్మ జాతర

ప్రత్తిపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద శంకర్లపూడిలో వేగులమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గరగల సంబరాలు, డప్పుల వాయిద్యాలు, తీన్మార్ నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, కుమారుడు సాయితర్షిత్, నియోజకవర్గ టీడీపీ నాయకులు దర్శించుకుని పూజలు చేశారు. అదే విధంగా ప్రత్తిపాడు ఎనియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, వైసీపీ నాయకులు కూడా వేగులమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

కల్యాణ మండపానికి మరమ్మతులు చేయాలి

శంఖవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న అన్నవరం దేవస్థానం కల్యాణ మండపాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ కోరారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశాల మేరకు ఆదివారం కల్యాణ మండపాన్ని దేవస్థానం ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ విభాగ అధికారులు పరిశీలించారు. మరమ్మతులు వెంటనే నిర్వహించి నెలరోజులలో పునః ప్రారంభించేందుకు కృషిచేయాలని కోరినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఈఈ నూకరత్నం, జల్లూరు సత్యనారాయణ, ఉపసర్పంచ్ చింతంనీడి కుమార్, బుర్రా ప్రసాద్, బుర్రా వాసు, లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.



శంఖవరంలో కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న సురేష్, దేవస్థానం సిబ్బంది

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

● 47 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కిర్లంపూడి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాల తర్వాత పూర్వ విద్యార్థులు అపూర్వకలయిక కిర్లంపూడిలో కొక్కొండ రామశేషగిరిరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. ఆదివారం దేవులపల్లి సూరిబాబు, పాలాట్ల వాసు, పేర్ల రమేష్ ఆధ్వర్యంలో ఈ అపూర్వకలయిక నిర్వహించారు. 47సంవత్సరాల తర్వాత ఎక్కడెక్కడో స్థిరపడిన ఆ పాఠశాలలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు సమావేశమై గురువులైన శ్రీధర్‌శాస్త్రి, బుర్రే రామారావు, కోటి, గోపి, సంపర రామకుమార్‌లకు శాలువాకప్పి పూలమాలలువేసి మెమోంటోలు అందజేసి సత్కరించారు. సాయంత్రం వరకు ఆట పాటలతో సందడి చేశారు.



కిర్లంపూడి ఉన్నత పాఠశాలలో కలుసుకున్న 1977-78 బ్యాచ్ విద్యార్థులు

టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడికి మాతృవియోగం

ప్రత్తిపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గ దివంగత నేత వరుపుల రాజా ముఖ్య అనుచరుడు టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల మణికంఠకు మాతృవియోగంకు గురయ్యారు. మణికంఠ తల్లి కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. దీంతో ఎమ్మెల్యే సత్యప్రభ, తనయుడు సాయి తర్షిత్‌లు కాకినాడ వెళ్లి మణికంఠ మాతృమూర్తి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నేత మణికంఠను కాకినాడ పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, సీబీఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ళ జగదీష్, ప్రత్తిపాడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగులకొండలరావు సంతాపం తెలిపారు.



మణికంఠ మాతృమూర్తికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఎటపాక క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా వల్లభనేని చందు



ఎమ్మెల్యేతో చందు, రవితేజ

ఎటపాక, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎటపాక క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా వల్లభనేని చందు, ఎటపాక కో క్లస్టర్ ఇంచార్జ్‌గా విజ్జగిరి రవితేజ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవీ వీరి నియామకాన్ని ప్రకటించారు. ఈసందర్భంగా చందు, రవితేజ మాట్లాడారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంను మండలంలో ప్రతీ ఇంటికీ తీసుకెళ్లి, కూటమి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, కార్యక్రమాలను వివరిస్తామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు మండలంలో బూత్ కన్వీనర్లను సమాయత్తం చేస్తామని చెప్పారు.

కొమురం భీం విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

కూనవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోతులగుట్టలో ఏర్పాటుచేసిన కొమురం భీం విగ్రహాన్ని ధ్వంసం చేసిన దేశద్రోహులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు సోడే ముత్తయ్య కోరారు. ఆదివాసీ సమాజంపై ఎవరో కక్షపూరిత ఉద్దేశంతో ఇటువంటి దాడులకు పాల్పడ్డారన్నారు. దీని వెనుక ఎవరున్నా క్షమించేది లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

పొల్లూరుకు పోటెత్తిన పర్యాటకులు



మోతుగూడెం,జూలై 13 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో అందమైన జలపాతం వద్ద పర్యాటక ప్రదేశాలు, జలపాతాలవద్ద ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ఏ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో జలపాతాలు కను విందు చేస్తున్నాయి. దీంతో పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. వర్షం సైతం లెక్కచేయకుండా పర్యాటకులు ఆంధ్ర, ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణా ఇతర పలు ప్రాంతాల నుంచి వస్తున్నారు. రెండురోజులు శని, ఆదివారం సెలవులు రావడంతో పొల్లూరు జలపాతంవద్ద కేరింతలు కొట్టి పర్యాటకులు సందడి చేశారు.



రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడికి వేడుకగా రథోత్సవం

అన్నవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం ఆర్జితసేవ అయిన రథోత్సవం వేడుకగా జరిగింది. ఉద యం 10 గంటలకు స్వామి,అమ్మవార్లను రథంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు అనంతరం తూర్పురాజగోపురం చుట్టూ భక్తుల గోవిందనామస్మరణలు నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ జాతర

రౌతులపూడి, జూలై 13(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి గ్రామ శివారులో ఉన్న మరిడమ్మ అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. ఆషాడమాసం ఆదివారం ఈ పండుగను యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్థులు అమ్మవారికి పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు తీర్చుకున్నారు.

'రైతుల సంక్షేమానికి కృషిచేస్తా'



మాట్లాడుతున్న మల్లేపల్లి సొసైటీ చైర్మన్ దిడ్డి చిన్న శ్రీను

గండేపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేస్తామని మల్లేపల్లి సొసైటీ చైర్మన్ దిడ్డి చిన్న శ్రీను అన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం అందిస్తుంద న్నారు. సహకార పరపతి సంఘం కార్యకలాపాలు పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. రైతులకు తక్కువ వడ్డీపై రుణాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సొసైటీసెక్రటరీ సింగలూరి వీర్రాజు, సభ్యులు వెలిది సుబ్రహ్మణ్యం, ఇల్లంకుల గురు నాయుడు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తెలగరెడ్డి భద్రరావు, బలిరెడ్డి గంగరాజు, కాటేపల్లి భద్రం పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

● ఇద్దరికి తీవ్ర గాయాలు

గండేపల్లి, జూలై13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ళూరు గ్రామ శివారు దాబా హోటల్ వద్ద శనివారంరాత్రి ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం పిల్లర్లకు బోర్లు వేసే ట్రాక్టర్ రోడ్డు దాటుతుండగా జగ్గంపేట వైపు నుంచి రాజమండ్రివైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ రోడ్డుపై బోల్తా పడింది. దానిపై ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను అంబులెన్సులో జగ్గంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అదృశ్యమైన వివాహిత తల్లికి అప్పగింత

గండేపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన ఒక వివాహిత భర్త దగ్గరికి వెళ్లడానికి ఇష్టంలేక ఎవరికీ తెలియకుండా అదృశ్యమైంది. దీనిపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు, సిబ్బంది దర్యాప్తు చేశారు. ఆమె నెల్లూరు పట్టణంలో ఉన్నట్లు గుర్తించి వెంటనే ఆమెను అక్కడి నుంచి తీసుకువచ్చి ఆదివారం ఆమె తల్లికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

ధర్మవరంలో ఉచిత వైద్య శిబిరం

ప్రత్తిపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో ఆదివారం మండలస్థాయి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శ్రీమ్ అపర్ణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ శిబిరంలో మండల వ్యాప్తంగా 400 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ముదునూరి మురళీకృష్ణంరాజును ట్రస్టు నిర్వాహకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంతుకుర్తి సుశీల అబ్బాయి, ఎంపీటీసీ నానిపల్లి సత్యవతిచంటి, ఉపసర్పంచ్ బొల్లు సీతారామరాజు, సేవారత్న అవార్డు గ్రహీత రాయుడు దొరబాబు,స్థానిక పెద్దలు కిల్లాడి బాబ్జి, కోలా తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

'బాబు పాలనలో మోసం గ్యారెంటీ'

ప్రత్తిపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో మోసం గ్యారెంటీ అని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు విమర్శించారు. మండలంలోని పెదశంకర్లపూడి గ్రామంలో అన్నవరం దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యులు దళే చిట్టిబాబు స్వగృహం వద్ద ఆదివారం జరిగిన వైసీపీ ముఖ్య నాయకుల సమావేశంలో గిరిబాబు మాట్లాడారు. సమావేశంలో మండల కన్వీనర్ రామిశెట్టి నాని, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవింద, దళే చిట్టిబాబు, ఏపూరి రామారావు, దళే నల్లబాబు, గుడాల వెంకటరత్నం,శేరు కృష్ణ, జువ్విన వీర్రాజు,డి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.